# సత్తెనపల్లి సరుకు

**-ఎం.మాధవీకృష్ణ**

అసలే మే నెల. ఉదయం ఆరింటికే బాలభానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. పనులు చేస్కోవడానికి తప్పనిసరిగా బయటికి వెళ్ళేవాళ్ళు తప్ప ఇళ్ళల్లో ఉండే జనం ఉదయం ఎనిమిదైతే బయటికి రావడానికి భయపడేంత ఎండ. అందుకేనేమో చీకట్లోనే లేచి పొద్దున్నే వాకిళ్ళు చిమ్ముకుని ముగ్గులు పెట్టుకుంటున్నారు ఆడంగులు. వీధులన్నీ అప్పుడే చిమ్మి నీళ్ళు తడిపొడిగా చల్లడంతో మంచి మట్టివాసన వేస్తున్నాయి.

తను కూడా ఎండలో తిరగలేననుకుందేమో ఆకుకూరలమ్మే మంగ పొద్దున్నే బయల్దేరింది త్వరగా గంప ఖాళీ చేసుకుని రావాలనుకుంటూ. ఓ రెండువీధుల్లో నాలుగు కట్టలమ్ముకుని అందరూ భయపడే ఆ వీధిలోకి భయంగా అడుగుపెట్టింది. ఎవరి కంట్లో పడకూడదో ఆ కళ్లల్లో పడనే పడింది.

అక్కడే వీధి వాకిట్లో కూర్చుని బ్రష్ చేస్కుంటూ కన్పించాడు మన కథానాయకుడు గణపతి.

దాదాపు ముప్పై ముప్పై ఐదు వయసు మధ్యలో ఉండే గణపతి ఓ చిన్నపాటి వడ్డీ వ్యాపారస్తుడు.

చిన్నప్పుడే అబ్బిందో మధ్యలో వచ్చిందో కానీ ఓ వింతైన అలవాటు అతనిది.

ఏ మనిషిని చూసినా అతను లేచిందగ్గర్నుంచీ రాత్రి పడుకునే వరకూ ఏం చేస్తాడో తెలుసుకుంటూ దానికి సంబంధించి తనకు తెలిసిన విషయ పరిజ్ఞానాన్నంతా అతడి మెదడులోకి బలవంతంగా ఇంజెక్ట్ చేయడం, వాళ్ల మెదడుని మిక్సీజార్‌లో తిప్పుకున్నంత ఈజీగా ఫ్రూట్‌జ్యూస్‌లా చేసుకుని తాగేయడం అతని హాబీ. ఏ టాపిక్ అయినా అన్నీ తనకు తెలుసునన్నట్లుగా మాట్లాడడం అతని బలహీనత.

కూరల బుట్ట ముఖానికి అడ్డంగా పెట్టుకుని అటు ప్రక్కకి తిరిగి నడుస్తున్న మంగని చూడనే చూశాడు గణపతి.

"ఏయ్ మంగా! పాలకూర కట్టలున్నాయా ఇవాళ?" అలా ఆశపెట్టి పిలిస్తే తప్పకుండా వస్తుందని నమ్మకం అతనిది.

"వున్నాయ్ బాబూ! అన్నీ చాలా తాజాగా ఉన్నాయి ఇవాళ" ఉత్సాహంగా అరుగు మీద బుట్ట దించుతూ చెప్పింది.

"ఎంతేమిటి?" అడిగాడు.

"పాలకూర, గోంగూరైతే కట్ట రెండ్రూపాయలండి. చుక్క కూరైతే మూడు. ఈ రోజు పొన్నగంటి కూర కూడా ఉంది. రేటు మాత్రం కొద్దిగా ఫిరుం బాబు" చెప్పింది.

వారంరోజుల క్రితం తాటిముంజలు పెట్టుకుని వస్తే రెండుగంటలపాటు దాన్ని మాట్లాడించి చివరకి కంటి తుడుపుగా రెండ్రూపాయలకు ముంజలు కొన్న విషయం మర్చిపోయింది అది.

"ఊఁ...ఇంత తాజాగా ఉన్నాయి. ఎక్కడ్నించి తెస్తావేంటి ఆకుకూరలు?"

"గుంటూరు పెద్ద మార్కెట్టులోంచి దిగుతాయి బాబూ"

"నువ్వెళతావా గుంటూరు?" అడిగాడు.

"అయ్యా! అక్కడ్నించి లారీలకొస్తయ్యి. మన మార్కెట్‌నుంచి మా ఆయన పట్టుకొస్తాడు" ఇది కూడా తెలీదా అన్నట్లు చెప్పింది.

"ఎన్నిగంటలకు తెస్తాడు? ఇంత పొద్దున్నే వస్తున్నావు?" మళ్లీ ప్రశ్న.

"చీకట్లోనే మూడింటికే లేచెడతాడు బాబు లారీలు వచ్చీ రావడంతోనే.." త్వరగా తీసుకుంటే బాగుండు అనే ఆశతో చెప్పింది.

"ఎన్నిగంపలు తెస్తాడు? ఏ లెక్కన తీసుకుంటారు? ఈ గంప ఒక్కటితోనే గిట్టుబాటు అవుతుందా నీకు?" మళ్లీ అడిగాడు.

"ఒక్కో పొద్దు నాలుగ్గంపల దాకా తీస్కుంటాం. మా అత్తమ్మ, మా ఆయన, నేనూ తలా ఒకటి తీసుకుని బయల్దేరతాం" విసుగ్గా చెప్పింది.

"గంపకి లాభం ఏమాత్రం ఉంటుందేమిటి? ఆహాఁ ఊర్కే అడుగుతున్నాలే. నీకేం పోటీ రానులే" జోకేశాననుకుని నవ్వుతూ అన్నాడు.

"బాబూ! నాకవతల బేరాలు పోతాయి" ఎండ పొద్దెక్కడంతో గంప నెత్తికెక్కించుకుంటూ చెప్పింది.

లోపలినుంచి ఇదంతా గమనిస్తున్న సుమ ఇహ లాభం లేదనుకుని "కాఫీ రెడీ...త్వరగా రండి" అంటూ గట్టిగా కేకేసింది.

"పొద్దున్నే మంచి బేరం దొరికింది" అని తిట్టుకుంటూ వెడుతున్న కూరలమ్మి మాటలు సుమ చెవిన పడి మనసు చివుక్కుమంది.

"విన్నావా సుమా! రోజుకి నాలుగు గంపల ఆకుకూరలమ్ముతారట. గుంటూరు మార్కెట్ నుంచి లారీలు దిగితే దాని మొగుడు తెల్లారగట్టే వెళ్లి పట్టుకొస్తాడట. అవునూ అన్నింట్లోకి పొన్నగంటి కూర మాత్రం రేటెక్కువంట. ఎందుకేమిటి? నీకు తెలుసా?" కాఫీ గ్లాసు అందుకుంటూ అడిగాడు.

"అది ఎక్కువగా దొరకదులెండి" విషయాన్నంతా తన దగ్గర మళ్లీ రిపీట్ చేస్తున్న భర్తని చూస్తూ విసుగ్గా చెప్పింది.

ఏమాటకామాటే చెప్పుకోవాలి. గణపతికి ఉన్న విషయ పరిజ్ఞానం ఓపిగ్గా అవతలివాళ్లని ఆరా తీసే వివరాలు, మళ్లీ వాటిని మరొకళ్ళ దగ్గర రిపీట్ చేయడం ఈ సుగుణాలే కాక నెల తర్వాతైనా, ఏడాది దాటినా కూడా గుర్తుపెట్టుకుని ఏదైనా ఆకుకూరల టాపిక్ వస్తే దాన్లో మంగ చెప్పిన విషయాలు కూడా కలిపి జోడించి మాట్లాడేటంత మెమరీ పవర్ ఉంది అతనికి.

తనకే అన్నీ తెలుసునన్నట్లుగా ఏకధాటిగా అనర్గళంగా అనవసర విషయాలు మాట్లాడే అతని తత్వంతో ఇరుగుపొరుగు వాళ్లు భయపడి తప్పించుకు తిరుగుతారు. అతను వీధివాకిట్లో నిలబడితే బలైపోతామంటూ మొహాలకు చేతులడ్డు పెట్టుకుని తప్పుకుంటారు.

'చాదస్తపు మొగుడు చెబితే వినడు కొడితే ఏడుస్తాడు' అన్న చందాన అతని భార్య సుమ మాత్రం లోలోపల బాధపడుతూ ఉంటుంది.

"ఏంటి మల్లికా! ఈమధ్య మళ్ళీ పక్క వీధిలో ఇళ్ళు కూడా ఒప్పుకున్నట్లున్నావ్. ఎంతిస్తారేమిటి?" ఖాళీ గ్లాసు అంట్లలో వెయ్యడానికి వెళ్లి పనమ్మాయి దగ్గర మాటలు మొదలుపెట్టాడు.

ఆ మాటలు విని "అగ్గిపెట్టె, సబ్బుబిళ్ళ కాదేదీ

కవితకనర్హం అన్న మహాకవి ఎక్కడున్నాడో గానీ తన భర్తకి మాత్రం పనిమనిషి దగ్గర్నుండి దేశరాజకీయాల వరకూ అన్నీ ఈయనకే కావాలి'' అని నిట్టూరుస్తూ స్నానానికి వెళ్లింది సుమ.

మళ్లీ భర్త వచ్చి పనమ్మాయి ఎన్ని ఇళ్లల్లో చేస్తుందో తనకి లెక్కలు వేసి చెప్తాడని భయపడి త్వరగా వెళ్లింది.

★ ★ ★

గణపతి పేరుకైతే చదువుకున్నవాడే గానీ లొడలొడా వాగడం తప్పితే ఓ హాస్పిటల్‌కి వెళ్లి డాక్టర్‌తో మాట్లాడలేడు. ఓ స్కూలుకెళ్లి పిల్లల కోసం టీచర్‌తో మాట్లాడలేడు. రైల్వేస్టేషన్‌కో, బస్టాండ్‌కో వెళ్లి చిన్నపాటి రిజర్వేషన్ కూడా చేయించలేని భయస్తుడు. భర్త విషయం తెలుసు కాబట్టి తనే అన్ని పనులు చేసుకుంటుంది సుమ.

పుట్టినదగ్గర్నించీ సత్తెనపల్లి తప్పితే మరో ఊరు తెలియని గణపతి మొదటిసారిగా పెళ్లైన



నాలుగేళ్లకి తోడల్లుడు ఉంటున్న బెంగుళూరు బయల్దేరాడు. దారి పొడవునా ట్రైన్‌లో జామకాయలమ్మేవాళ్లని, పల్లీలు, కాఫీ,టీల వాళ్లని, ఇడ్లీ పొట్లాలమ్మే వాళ్లని, ఎదురుబెర్తు, పక్క బెర్తు వాళ్లని ఎవర్నీ వదల్లేదు గణపతి. వాళ్ల డేటుడేవిషయాలన్నీ రాబట్టాడు.

బెంగుళూరు చేరాక చిన్న ఊళ్ళోనే విశేషాలకి, విషయాలకి కొదవలేని అతనికి అంతటి మహానగరం రారమ్మని ఆహ్వానిస్తున్నట్లు అనిపించింది. కానీ విచిత్రమేంటంటే వాళ్ల తోడల్లుడి కుటుంబంతో ఎక్కడికి వెళ్లినా ఇవేమీ తనకు పెద్దగా పట్టనట్లుగా పెద్ద విషయాలు కానట్లుగా తోసి పడేసేవాడు.

కబ్బన్‌పార్క్‌కి వెళితే "అబ్బే! ఇదేం ఉందండీ? మా హైద్రాబాద్‌లో ఇందిరాపార్కు కన్నా పెద్దదేం కాదు" అనేవాడు.

కెఫెడేకి తీసుకెళితే "ఇవేం ఉన్నాయ్? మా గుంటూర్లో స్వగృహఫుడ్స్ చూడాలి" అనేవాడు.

ఇస్కాన్ టెంపుల్‌కి తీసుకెళితే "మా బిర్లామందిరమే బాగుంటుంది. ఈ కృష్ణుడికన్నా..మా బాలాజీ బాగుంటాడు" అని చెప్పేవాడు.

## షాంఘైలో భూగృహం

చైనాలో అతి పెద్ద నగరం షాంఘై. జనాభా 1.8 కోట్లు. చైనా ఫైనాన్షియల్ రాజధాని. ఒకవేళ ప్రమాదవశాత్తు బాంబ్‌బ్లాస్ట్‌లు జరిగినా, అణుబాంబులు ప్రయోగించినా ప్రజల్ని రక్షించడానికి నగరం క్రింద ఒక పెద్ద భూగృహాన్ని నిర్మించారట. దాంట్లో రెండులక్షలమంది 15రోజులపాటు తల దాచుకోవడానికి అవసరమైన నీళ్ళు, కరెంటు, స్వచ్ఛమైన గాలి ఏర్పాటు చేసారు. ఈ స్థలం వైశాల్యం 90,000 చ.మీ. నగరంలో అన్నివైపుల నుంచి ప్రజల్ని చేర్చడానికి 60 కి.మీ పొడవైన సొరంగాలున్నాయి. అయితే అత్యవసర పరిస్థితుల్లో ఇక్కడికి చేరగలిగే రెండులక్షలమంది ఎవరన్నది ఇంకా నగర పాలకులు నిర్ణయించలేదట.

## ప్రపంచంలో అతి పెద్ద లాండ్రీ

చికాగో శివార్లలో ప్రపంచంలోనే అతి పెద్ద లాండ్రీ సిస్టమ్‌ను నడుపుతున్నాడు 61 సంవత్సరాల టామ్‌బెన్సన్. దాంట్లో 153 వాషర్లు, 148 డ్రైయర్లు ఉండడమే కాకుండా ఆ మొత్తం సిస్టమ్‌ను సోలార్ పవర్‌తో నడపడం విశేషం. ఈ లాండ్రీని 24 గంటలసేపు నడపడమే కాకుండా కస్టమర్లని ఎంటర్‌టైన్ చేయడానికి అక్కడ 15 టీవీలను కూడా ఏర్పాటు చేసాడతను. లక్షన్నర డాలర్లతో ఏర్పరచిన ఆ వాటర్ సిస్టమ్ వాతావరణ కాలుష్యాన్ని కలిగించదని నిపుణులు అంటున్నారు.

-విమలారామం




పానీపూరీలు, భేల్‌పూరీలు, ఛాట్ మసాలలన్నీ తనకి తెలుసన్నట్లుగా ఫోజిచ్చేవాడు. అతను ఇంతవరకు సొంత ఊరు దాటి ఎక్కడికీ వెళ్ళలేదన్న విషయం ఒక్క సుమకి మాత్రమే తెలుసు.

కానీ విషయాలన్నీ ఆకళింపు చేసుకునేవాడు.

తిరిగి వచ్చేటప్పుడు గణపతి బంధువులు కర్నాటకలోని హాసన్ జిల్లాలో ఉంటూ వీళ్ళని రమ్మని పిలవడంతో అక్కడికొక విజిట్ వేసి వచ్చారు. అక్కడ వాళ్లకి కాఫీ ఎస్టేట్‌లు ఉండడంతో గణపతికి ఆ తోటల వెంబడి తిరగడం వాళ్ల ఆర్థిక వ్యవహారాలు తెలుసుకోవడం బాగా కాలక్షేపం అయ్యింది.

సుమకి ఒక విషయం ఇప్పటికీ విచిత్రం అన్పిస్తుంది. అక్కడ ఉన్నన్నాళ్ళూ మాది గొప్ప, మేము గొప్ప అని చెప్పుకుంటూ వాళ్ల ప్రాణాలు తోడేసిన భర్త ఇక్కడికి రావడంతోనే ఊరంతా తమ బెంగుళూరు ట్రిప్ గురించి చాలా గొప్పగా చెప్పేవాడు.

"అబ్బబ్బ! అక్కడ కృష్ణుడి గుడి ఉంది చూశారూ ఎంత ఖర్చుపెట్టారో..' పక్కింటి సుబ్రహ్మణ్యం గారు చిక్కుకుపోయేవారు ఒకరోజు.

"ఆ పార్కులూ, ఆ చల్లని వాతావరణం..మనమూ ఉన్నాం. ఈ ఎండలకి మాడి మసైపోతూ.. అక్కడి వాళ్ళ లైఫే లైఫనుకోండి.." మరోరోజు ఎదురింటి రామ్మూర్తిగారిని ఊకదంపుడుతో అదరగొట్టేవాడు.

"అక్కడ కాఫీ తోటలు ఎలా ఉంటాయనుకున్నారు? కాఫీ పూత పూసినప్పుడు చూడాలి దాని అందం. అచ్చంగా మల్లెపూవుల్లా, మల్లెతోటలా కన్పిస్తుందండీ. ఇక మిరియాలు, యాలకులు, కుంకుళ్ళు మనకన్నా రేటు తక్కువ. దారి పొడవునా పనసచెట్లు పిచ్చి చెట్లలా ఉంటాయంటే నమ్మండి. మనకి పనసతొనలు తినడం, పనసపొట్టు కూర మాత్రమే తెలుసు. వాళ్లు పనసతొనల్ని సన్నగా కట్‌చేసి, ఫ్రై చేసి ఉప్పూకారం చల్లి మన కారప్పూసలా చేస్తారు. ఆ గింజలు కూడా పారేయరు. వాటిని ఉడకబెట్టి వేగించి ఉప్పుకారం చల్లి మనకిస్తే మనం జీడిపప్పు అనుకుని తినేస్తాం" అంటూ వెనకింటి విశాలమ్మ పంచదారకొస్తే ఆపేసేవాడు.

దాదాపు ముప్పాతిక ఊరిజనానికి తెలిసిపోయింది అతని బెంగుళూరు ట్రిప్ గురించి. అతని వెనకాల నవ్వుకునే వాళ్ళు ఎక్కువ కావడంతో సుమకి బాధగా అన్పించింది.

★ ★ ★

ఆరేళ్ల గణపతి కూతురు చిన్నికి హార్ట్ ప్రాబ్లమ్ వల్ల ఆపరేషన్ చేయించాల్సి వచ్చింది.

బెంగుళూరులో ఉన్న అక్కగారైన సునందని డైరెక్టుగా హైదరాబాద్ రమ్మని ఫోన్ చేసింది. ఇంటర్ చదివే కూతురు దివ్యతో తోడుగా వచ్చింది సునంద. వచ్చిందగ్గర్నుండీ డాక్టర్‌తో మాట్లాడడం, నర్సులతో మాట్లాడడం, బిల్స్ పే చేయడం అన్నీ వాళ్ళే చూసుకున్నారు. అంత ఓవర్‌గా మాట్లాడే గణపతి ఆ హాస్పిటల్, దాని గంభీర వాతావరణం చూసి మౌనంగా ఐపోయాడు.

నాలుగురోజులు గడిచిపోయాయి. ఆపరేషన్ సక్సెస్ అయ్యి, మరుసటి రోజు చిన్నిని డిశ్చార్జ్ చేస్తామన్నారు. కూతురు గొడవ చేయడంతో గణపతిని సుమకి తోడుగా నర్సింగ్‌హోంలో ఉండమని చెప్పి షాపింగ్‌కి బయలుదేరింది సునంద.

వాళ్లిద్దరూ ఒంటరిగా షాపింగ్‌కి వెళ్లడానికి ఇష్టపడలేదు గణపతి. అలాగని తను తోడుగా వెళ్లి హైదరాబాద్‌లో షాపింగ్ చేయించలేడు కూడాను.

"ఆ(( మీ బెంగుళూరు కన్నా షాపింగ్ మాల్స్ ఏముంటాయి ఇక్కడ?" అంటూ వాళ్లని ఆపడానికి ప్రయత్నించాడు కానీ కుదరలేదు.

వాళ్ళు వెళ్లిందగ్గర్నించి దివ్య దగ్గర మొబైల్ ఉండడంతో నిముషానికోసారి రింగ్ చేయడం మొదలుపెట్టాడు.

"ఆటోకి ఎంత ఇచ్చారు దివ్యా?" అంటూ..."ఆ ఆ రిటర్న్‌లో కూడా అంతే పే చెయ్యండి. ఎక్కువగా ఇవ్వకండి..." అంటూ మాట్లాడాడు.

"అదేంటమ్మా! రావడానికి, వెళ్లడానికి ఒకే దూరం కదా! అదేదో విష యంలా చెప్తాడేంటి బాబాయ్?" ఆశ్చర్యంగా వాళ్లమ్మని అడిగింది దివ్య. గణ పతి విషయం తెల్సిందే కావడంతో నవ్వి ఊరుకుంది సునంద.

మళ్లీ ఓ అరగంటాగి ఇంకోసారి ఫోన్ "ఎక్కడ ఉన్నారు?" అంటూ.

"బేగంపేటలోనే ఉన్నాం బాబాయ్ హైదరాబాద్ సెంటర్‌లో" చెప్పింది దివ్య.

"సరే...సరే...షాపింగ్ అయ్యాక అక్కడ కొద్దిగా ఆపోజిట్‌లో ఫ్రూట్‌జ్యూస్ షాప్స్ ఉన్నాయి. దాహంగా ఉంటే వెళ్లండి. అలాగే దానికి లెఫ్టో, రైటో సరిగ్గా గుర్తులేదు గానీ పిజ్జా కార్నర్ ఉంటుంది చూడండి" అంటూ చెప్పాడు.

తనకి ఆ షాపింగ్‌మాల్ గురించి తెలియకపోయినా తెలిసినట్లు వాళ్ళు అనుకోవాలనే తపన అతనిది. ఇంత పెద్ద సిటీలో నాలుగడుగులకొక పిజ్జా కార్నర్, జ్యూస్ షాప్స్ ఉంటాయని తెలుసు అతనికి.

దివ్యకి సెలవులే అవడంతో సునంద, దివ్య ఇద్దరూ 'వీళ్లతో' సత్తెనపల్లి చేరారు. ఓ నాల్రోజులు పోయాక సునంద కొడుకు ధీరజ్ తల్లిని, చెల్లిని తీసు కెళ్లడానికి వచ్చాడు. అతనికి అమెరికాలో ఎంఎస్ సీటు రావడంతో వెళ్ళే ముందు పిన్ని, బాబాయ్‌ని కూడా ఓ సారి చూడొచ్చని వచ్చాడు.

ఈ నాల్రోజుల్లో వాళ్లకి తెలియనంత గొప్పగా హైదరాబాద్ విశేషాలు ఇరు గుపొరుగు వాళ్ళతో గణపతి ఊదరగొట్టడం వింటూనే ఉన్నారు. పాపని చూడ డానికి వచ్చేవాళ్ళు కూడా అతను ఇంట్లో లేని సమయం చూసి రావడం, సుమ బాధపడడం చూసి ధీరజ్ పిన్నిని ఓదార్చాడు.

"పిన్నీ! ఇన్నేళ్లలో బాబాయ్‌కి తన బిహేవియర్ ఏంటో తెలియజె ప్పావా?" అడిగాడు.

"రెండు, మూడుసార్లు ట్రై చేశానురా. కానీ నా మాటలు తేలిగ్గా తీసేశారు" చెప్పింది.

"అయితే ఇంజెక్షన్ చెయ్యాలన్నమాట" ధీరజ్ సాలోచనగా తలపంకిం చాడు.

★ ★ ★

ఓరోజు "బాబాయ్ ఇది తిని చూడు. మా ఫ్రెండ్ అమెరికానుంచి పంపిం చాడు" అంటూ పేన్లా ఉన్న ఓ ముద్దని గణపతి చేతికిచ్చాడు ధీరజ్.

"ఇదేమిటి? అప్పడాల ముద్దలా ఉందే? ఇవి మన ఊళ్ళోనే ఇంతకన్నా బాగా చేస్తారు. అయినా నీకు తెలుసా ధీరజ్ ఇక్కడ్నుంచి వెళ్లినవాళ్ళు అక్కడ మన బజ్జీలు, ఊరగాయలు హోటల్స్ పెట్టుకుని కోటీశ్వరులయ్యారు. నీకు అక్కడ ఏం భయంలేదులే. ఊరగాయనుండి ఊతప్పం వరకూ అన్నీ దొరుకు తాయి. గ్లోబలైజేషన్ పుణ్యమా అని మునుపటి ఎన్నారైల కన్నా ఇప్పటివాళ్ళు అదృష్టవంతులు..." విదేశాల గురించి ఇంకా తనకెంత తెలుసో చెప్పుకుంటూ ఆ టాపిక్‌లో దూసుకుపోతున్న గణపతి సడెన్‌గా పెద్దగా నవ్వులు విన్పించ డంతో ఆగిపోయేడు. సుమ, సునంద, దివ్య, ధీరజ్ అందరూ పగలబడి నవ్వు తున్నారు. వాళ్లకేసి ఆశ్చర్యంగా చూశాడు గణపతి.

"ఇదిగో పిన్నీ నా వెయ్యి తీసుకో నువ్వే గెలిచావ్" డబ్బులు సుమ చేతి కిస్తూ చెప్పాడు ధీరజ్.

"ఇవిగో మా నాలుగువేలు" సునంద, దివ్య దిగాలుగా ముఖాలు పెట్టు కుని ఇచ్చారు సుమకి.

"అన్నట్లు మర్చేపోయాను. పక్కింటి సుబ్రహ్మణ్యం గారివి ఎదురింటి రామ్మూర్తి గార్లవి నాలుగువేలు ఈరోజు నీకలెక్షన్ మొత్తం" అంటూ సుమచే తికిచ్చాడు ధీరజ్.

గణపతికి అయోమయంగా అన్పించి అందరివైపు ఓ చూపు సారించాడు.

"మరేం లేదు బాబాయ్! ఈరోజు పిన్ని మిగతావాళ్లం నీమీద ఓ పందెం కాసుకున్నాం. నువ్వు అప్పడాల ముద్ద మీద అరగంట మాట్లాడతావని మేము, కాదు అమెరికా మీద గంటసేపు మాట్లాడావని పిన్నీ అనుకున్నాం. చివరికి పిన్నే గెలిచింది. ఛ్! ఎంతైనా నీ భార్య కదా! ఇంతకీ నీ చేతిలో మిగిలిపో యింది మీ సత్తెనపల్లి సరుకే" నవ్వుతూ చెప్పాడు ధీరజ్.


గణపతి మొహం వెలతెల పోయింది.

★ ★ ★

"హలో పిన్నీ! బాంబే నుంచి...ఫ్లైట్ ఎక్కబోతున్నాను. ఎలా ఉన్నారు? బాబాయ్ ఏమన్నా మారాడా?" ఫోన్‌లో పలకరించాడు ధీరజ్.

"బాగున్నాముదా. నీ డోస్ కాస్త పన్జేసింది. ఇప్పుడు వెనకా, ముందు కొద్దిగా చూసుకుని మాట్లాడుతున్నారు. ఇంతకీ నీకు ఆల్ ది బెస్ట్ రా ధీరజ్.." ఆనందంగా చెప్పింది సుమ.

★



## సార్థకత

దేవదాసు హిట్ అయ్యాక వైఎస్.చౌదరి ఖాతాలో మంచి ఆఫర్లు వచ్చిపడుతున్నాయి. తాజాగా 'ఒక్క మగాడు' చిత్రాన్ని ఆయన ఈమధ్యే ప్రారంభించారు. యువరత్న బాలకృష్ణ నటిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 28న విడుదలవుతుందని చౌదరి ప్రకటించారు. విశేషం ఏమిటంటే ఎన్టీఆర్ సూపర్ హిట్ చిత్రం అడవిరాముడు ఆరోజే విడుదలయింది. ఈ చిత్రానికి పోసాని కృష్ణమురళి కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణల్ని అందిస్తు న్నారు. మొత్తానికి బాలకృష్ణ ఈ చిత్రం టైటిల్‌లాగే మంచి హిట్ కొట్టగల దని ఆశిద్దాం.

